క్లుప్తంగా

22న మహాఅన్నదానం

శాయంపేట : ఈనెల 22వ తేదీన అయోధ్యలో రాముని ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని పత్తిపాక గ్రామంలోని శ్రీసంజీవ ఆంజనేయ దేవాలయం ప్రాగణంలో భజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు శ్రీరామాంజనేయా భజన మండలి సభ్యులు మాందాడి రాజు, తడక సదానందం తెలిపారు. అనంతరం మహాఅన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నదానికి దాతలు ధన రూపేనా, వస్తు రూపేనా సాయం అందించాలని కోరారు.

పాఠశాలలో యాంటీ ర్యాగింగ్ టీమ్ ఏర్పాటు



మడికొండ: మడికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాంటీ ర్యాగింగ్ టీమ్‌ను మడికొండ ఎస్సై రాజబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. చదువుపై దృష్టి సారించి ముందుకు సాగాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి, ఎస్సై జక్కుల రాజబాబు, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీసీని కలిసిన స్టడీ సర్కిల్ డైరెక్టర్



కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ డైరెక్టర్ డాక్టర్ జగన్మోహన్ శుక్రవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

మర్కజీ జంక్షన్‌లో సిగ్నల్స్‌కు ప్రతిపాదనలు

సాక్షి ఎఫెక్ట్..

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ జీడబ్ల్యూఎంసీ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. 'మర్కజీ జంక్షన్‌లో బారికేడ్లు' అనే పేరుతో సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోకి అంబులెన్సులు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని పోలీస్ కమిషనర్‌కు ఆస్పత్రి ఉన్నతాధికారులు వినతిపత్రం అందజేశారని, ఈక్రమంలో తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మర్కజీ సెంటర్‌లో డివైడర్లను ఏర్పాటు చేసి జీఎంహెచ్ ఎదుట అంబులెన్సులు వెళ్లేందుకు వీలుగా డివైడర్లు తెరిచినట్లు వివరించారు. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా, ప్రమాదాలను నియంత్రించడం కోసం మర్కజీ సెంటర్‌తో పాటు అమృత టాకీస్ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు వాహనదారులు, ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

మంత్రి దామోదరకు సన్మానం

కేయూ క్యాంపస్: వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఈనెల 18న హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ కోఆర్డినేటర్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ దయాకర్ తెలిపారు. పార్టీ విధేయులైన వారికే వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ టికెట్ ఇచ్చి గెలుపునకు కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

డంపింగ్ యార్డుతో తీవ్ర ఇక్కట్లు



మడికొండ: మడికొండ శివారులోని డంపింగ్ యార్డును మాజీ మంత్రి గుండె విజయరామారావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి వెలువడే విషతుల్యమైన పొగతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి డంపింగ్ యార్డును నగరానికి దూరంగా తరలించాలని సూచించారు. అలాగే, శాస్త్రీయ పద్ధతిలో చెత్తను ఖననం చేయాలని కోరారు.

అనధికార షెడ్లు, పందిళ్లను తొలగించాలి

- మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి
- అనధికారికంగా ఏర్పాటు చేసిన షెడ్లు, బోర్డులు, సామగ్రి తొలగింపు



రోడ్డుపై చిరువ్యాపారాలను వెనుకకు జరిపిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

పరకాల : పట్టణంలోని వివిధ దుకాణాల ఎదుట అనధికారికంగా ఏర్పాటు చేసిన రేకులషెడ్లు, పందిళ్లతో పాటు బోర్డులను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి సూచించారు. వాహనాల పార్కింగ్‌కు వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులతో పాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు, హుజూరాబాద్‌రోడ్డు, వెల్లంపల్లి రోడ్డులోని దుకాణాదారులతో పాటు చిరువ్యాపారాల ప్రదేశాన్ని టౌన్ ప్లానింగ్ అధికారి రాజు, మున్సిపల్ ఉద్యోగులు పరిశీలించారు. చాలా మంది దుకాణాదారులు ఇష్టారాజ్యంగా రోడ్లను ఆక్రమించి షెడ్డులు ఏర్పాటు చేయడంతో పాటు దుకాణాల సామగ్రిని ఉంచినట్లు గుర్తించారు. కొందరు దుకాణారుల సామగ్రిని తక్షణమే వెనుకకు జరిపించిన మున్సిపల్ అధికారులు, మిగతా వారంతా రెండు రోజుల్లో రోడ్లపై ఏర్పాటు చేసిన షెడ్లు, పందిళ్లను స్వచ్ఛందంగా తొలగించాలని ఆదేశించారు. లేనిపక్షంలో జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డుకు ఆనుకుని షెడ్లు, బోర్డులు, పందిళ్ల ఏర్పాటు చేస్తే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. వస్తువుల కొనుగోలుకు మార్కెట్‌కు వస్తున్న ప్రజలు ద్విచక్ర వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. దుకాణాదారులు తమ స్వార్థం కోసం ఆలోచించొద్దని అన్నారు.



రోడ్డుపై ఉన్న సామగ్రి తొలగిస్తున్న సిబ్బంది

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నియామకపత్రం అందజేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

వేలేరు : గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆపార్టీ మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని షోడాషపల్లిలో శుక్రవారం కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా దయ్యాల స్వామి, ఉపాధ్యక్షులుగా గొడుగు సంపత్, మెరుగు బుచ్చిరెడ్డి, నమిండ్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా మ్యాక మహేష్, కార్యదర్శిగా కొయ్యడ భిక్షపతి, సంయుక్త కార్యదర్శిగా నేరెళ్ల మల్లేష్, మహిళా, యూత్ విభాగాల అధ్యక్షులుగా కొట్టె స్వప్న, జినుకల రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, అనిల్, శ్రీకాంత్, రాజమ్మ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొన్నం రాక

ఎల్కతుర్తి : మండల కేంద్రానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ శనివారం రానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఐనవోలు : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బహిరంగ ప్రదేశంలో ముగ్గురు వ్యక్తులు మద్యం సేవిస్తూ పట్టుబడగా వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరంగా చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు



శావకార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఊరుగొండ సమీపంలోని దుర్గంపేట్‌లో శావతీసే కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసచార్యులు మంత్రోచ్ఛరణ నడమ శావతీయగా గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. సర్పంచ్ పురాణం రాజేశ్వరిఈశ్వర్, ఎంపీటీసీ గందు రాము, వార్డు సభ్యులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

తిరుపతికి గండ్ర జ్యోతి పాదయాత్ర

శాయంపేట : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్‌లో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి నేడు పాదయాత్రగా బయలుదేరనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కుబడిని చెల్లించుకునేందుకు పాదయాత్ర చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

దామెర : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న పలువురిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. పెండింగ్ చాలాన్లను చెల్లించాలన్నారు.

రేపు టీజేఎస్ రాష్ట్ర సదస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీజేఎస్ నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్ర విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్షను నిరసిస్తూ తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో చేపట్టిన రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చిల్లా రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈమేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సదస్సు వాల్‌పోస్టర్లను బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా నది జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా, ఉద్యోగుల విభజన, పెండింగ్‌లో ఉన్న రాష్ట్రస్థాయి సంస్థలు, ఆస్తుల విభజన, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శించారు. న్యాయమైన విభజన హామీ సాధనకు చేపట్టిన రాష్ట్ర సదస్సుకు మేధావులు, ఉద్యోగులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాధాకిషన్, బండారి ప్రభాకర్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సృజన, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సఖి కౌన్సిలర్ విజయలక్ష్మి

కాజీపేట అర్బన్: మహిళలు తమ కోసం రాజ్యాంగం ప్రసాదించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ సోషల్ కౌన్సిలర్ విజయలక్ష్మి సూచించారు. 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సఖి సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, స్త్రీ, శిశు సంక్షేమ సౌజన్యంతో బాధిత మహిళలు, బాలికలు అండగా సఖి సెంటర్ సేవలందిస్తోందని వివరించారు. ఆపదలోని మహిళలకు తాత్కాలిక వసతి, వైద్య, పోలీస్ సేవలతో పాటు కౌన్సెలింగ్ అందజేస్తున్నట్లు చెప్పారు. బాధితులు 181, 0870 - 2452112 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సఖి సిబ్బంది హరిత, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్‌హై

హసన్‌పర్తి: నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని హనుమకొండ విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హై సూచించారు. హసన్‌పర్తి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బిగ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బిగ్ హెల్ప్ ఫౌండేషన్ చేపడుతున్న సేవలను అభినందించారు. బిగ్‌హెల్ప్ మేనేజింగ్ ట్రస్టీ ఎం.సరోజిని మాట్లాడుతూ పది మంది నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ షేక్ చాంద్‌పాషా, ఎంఈఓ రామకృష్ణరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

హసన్‌పర్తి మండలం ముచ్చర్లలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. చల్లా పూలమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో చిర్ర రాజేష్, కన్నబోయిన రాజు, చిర్ర శ్రవణ్, మట్టెడ అనిల్, సతీష్‌చారి, సంతోష్, ప్రధానోపాధ్యాయుడు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిపేట జాతర పనుల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ రిజ్వాన్ బాషా

కాజీపేట అర్బన్: 44వ డివిజన్ పరిధిలోని అమ్మవారిపేట సమ్మక్క - సారలమ్మ జాతర పనులను బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం పరిశీలించారు. జాతర పనులను త్వరగా పూర్తి చేయాలని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జాతర కమిటీ ఎన్నికలో రసాభాస



చైర్మన్ పదవి కోసం జరుగుతున్న వాగ్వాదం

వేలేరు : మండలంలోని పీచర సమక్క సారలమ్మ జాతర కమిటీ ఎన్నిక రసాభాసగా మారింది. సర్పంచ్ మ్యాక రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులు సమావేశమయ్యారు. గ్రామంలోని వివిధ కులాలకు చెందిన వ్యక్తులు చైర్మన్ పదవి ఇవ్వాలని నినాదాలు చేస్తూ గొడవకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సర్పంచ్ ఈ ఏడాది జాతర కమిటీ ఎన్నినను చేపట్టబోమని, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోనే జాతరను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైద్య సదుపాయాలను వినియోగించుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

ఆత్మకూరు : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలను వినియోగించుకోవాలని ఆత్మకూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు టింగిలికారి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు వైద్య సూచనలు పాటించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వైద్య సేవలను మెరుగుపర్చుతుందని అన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందిస్తామని ఏరుకొండ రజనిరవీందర్ గౌడ్ తెలిపారు. అనంతరం వికసిత్ భారత్ పోస్టర్ ఆవిష్కరించారు. కెనరాబ్యాంక్ ఆఫీసర్ శ్రావణి, వైద్యులు నర్సింగరావు, ల్యాబ్ సూపర్‌వైజర్ వంగల రాజేంద్రప్రసాద్, నర్సమ్మ, ఎన్‌జీఓ ప్రతినిధులు నాగబండి శివప్రసాద్, అనిల్ పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్వర్ణ

ఐనవోలు : మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదపడతాయని, యువత క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్టను చాటేలా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని పున్నేలులో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆమె బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో యువత రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కత్తి దేవేందర్, నాయకులు రాయపురం సాంబయ్య, వాకిటి చందర్‌రెడ్డి, ఎండీ చాంద్‌పాషా, యువకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మృతదేహంపై పూలమాల వేస్తున్న ఈఓ



కమలాపూర్ : ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓలు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేసిన నందనం సదానందంశర్మ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. సమాచారం అందుకున్న ఆలయ ఈఓ కిషన్‌రావు సదానందంశర్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి తీరనిలోటని విచారణ వ్యక్తం చేశారు. అర్చకుడి అంత్యక్రియల నిమిత్తం దేవాదాయశాఖ నుంచి రూ.20వేలు బాధిత కుటుంబానికి అందించినట్లు పేర్కొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో సాంకేతిక సహాయకుడిగా పని చేస్తున్న కె.సంతోష్ ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని ఎంపీడీఓ గుండె బాబు, ఎంపీఓ జి.విమల, ఏపీఓ రమేష్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.72 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, జిల్లా ఈసీ సంఘం, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, జీపీ డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ సబార్డినేట్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

దామెర : మండల కేంద్రంలో నేడు నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని స్థానిక సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి కోరారు. ఉదయం 9 గంటలకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మొబైల్ మెడికేర్ యూనిట్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 60 ఏళ్లు పైబడినవారు ఆధార్ కార్డు తీసుకొని శిబిరానికి హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

లోకల్ కోర్టులతో విద్యుత్ సమస్యల పరిష్కారం

- టీఎస్ఎన్పీడీసీఎల్ చైర్మన్ తిరుమలరావు



మాట్లాడుతున్న టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్ తిరుమలరావు

కమలాపూర్ : విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే విద్యుత్ శాఖ లోకల్ కోర్టులు ఏర్పాటు చేసిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ చైర్మన్ తిరుమలరావు అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం కమలాపూర్, ఉప్పల్, ఎల్కతుర్తి సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లోకల్ కోర్టులో పలువురు విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కార మార్గాలు చూపారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారుల కరెంట్ మీటర్లలో సమస్యలు, ఇతర సమస్యలు ఉన్నా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అలాగే గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఉన్నా సరి చేస్తామన్నారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, విధిగా ప్రతి ఇంటికి కరెంట్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసే లోకల్ కోర్టులను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ -1 ఫైనాన్స్ మెంబర్ ఆర్.చరణ్‌దాస్, ఇండిపెండెంట్ మెంబర్ ఎస్.నరేందర్, ఎస్ఈ వెంకటరమణ, డీఈ బి.సామ్యానాయక్, ఏడీఈ కె.షైడయ్య, ఏఈలు, సబ్ ఇంజనీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.